క్లుప్తంగా

అంధురాలైన భార్యను మోసం చేసిన భర్త

మల్కాపురం: అంధురాలైన భార్యను వదిలించుకునేందుకు సిద్ధమయ్యాడు ఓ భర్త. దీంతో ఆమె న్యాయం కోరుతూ పోలీసులను ఆశ్రయించింది. మల్కాపురం సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలివి.. మల్కాపురం సమీపంలోని జై ఆంధ్రకాలనీలో మద్దెల అనురాధ అనే అంధురాలికి 2002లో అశోక్‌తో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వీరికి ఓ కుమార్తె కూడా ఉంది. నిరుపేద, అంధురాలు కావడంతో అనురాధను వదిలించుకునేందుకు గాను కొంతకాలంగా దూరంగా ఉండటంతో ఆమె పెద్దలను ఆశ్రయించింది. పెద్దలు అశోక్‌కు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. అయితే, పోలీసుల ఎదుట కూడా అతడు భార్యతో కలిసి ఉండేందుకు అంగీకరించకపోవడంతో, పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



విద్యార్థులకు రాతసామగ్రి అందిస్తున్న దృశ్యం

మల్కాపురం: శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. వారికి అవసరమైన స్టడీ మెటీరియల్, పరీక్ష అట్టలు, కంపాస్ బాక్స్‌లను బుధవారం అందజేశారు. శ్రీహరిపురం హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పి.గణబాబు కుమారుడు మౌర్యసింహ పాల్గొని విద్యార్థులకు వీటిని అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధి కోరాడ శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న బెహరా భాస్కరరావు తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు బంటా కాలనీ అభయాంజనేయ స్వామి, గణపతి, దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 51 మంది ఎంపిక



పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 51 మంది ఎంపికయ్యారు. హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్స్ సంస్థలో ఉద్యోగాల నిమిత్తం జరిగిన టెస్ట్‌కు ఉమ్మడి విశాఖ జిల్లాలోని 18 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన 401 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో 169 మంది క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపికైన సంగతి తెలిసిందే. వీరికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించగా అందులో 51 మంది సదరు కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.2.9 లక్షల ప్యాకేజీ లభిస్తుందని పేర్కొన్నారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ

సింహాచలం: గ్లకోమా వ్యాధి నివారణకు ముందస్తు గుర్తింపు తప్పనిసరని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి గ్లకోమా వైద్యనిపుణుడు డాక్టర్ రవీంద్ర తెలిపారు. శంకర్ ఫౌండేషన్‌లో ఈ నెల 9 నుంచి జరుగుతున్న గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆస్పత్రి నుంచి వేపగుంట జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ కంటి యొక్క నిశ్శబ్ద దొంగగా పిలువబడే గ్లకోమా కంటి వ్యాధుల సమూహాన్ని కలిగి ఉంటుందన్నారు. దృష్టి కోల్పోవడానికి దారితీస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డీజీఎం బంగార్రాజు పాల్గొన్నారు.

శంకుస్థాపనతో సరి..

ఆ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణ పనులకు భూమి పూజలు జరిగాయి. ఒకటీ, రెండూ కాదు ఏకంగా తొమ్మిది నెలలు గడిచాయి. ఇప్పటికీ పనులకు సంబంధించి ఒక్క ఇటుక కూడా అక్కడ వేయలేదు. దీంతో ఆ ప్రాంతవాసులు ప్రమాదపుటంచున బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నారు.

తొమ్మిది నెలలు కావస్తున్నా ప్రారంభం కాని పనులు

రక్షణగోడ నిర్మాణం కోసం స్థానికుల ఎదురుచూపులు



ప్రమాదపు అంచున ఉన్న నివాసాలు

మల్కాపురం : జీవీఎంసీ 59వ వార్డు గణపతినగర్ కొండ ప్రాంతంలో సుమారు 8 వందల మంది వరకు నివాసం ఉంటున్నారు. అయితే, భారీ వర్షాలు కురిసినప్పుడు కొండపై మట్టి చరియలు విరిగిపడటం, బండ రాళ్లు దొర్లు కుంటూ రావడంతో ఇక్కడి ఇళ్లు కూలిపోతున్నాయి లేదా కొండ చరియలు ఇంటిపై పడటంతో నష్టం వాటిల్లుతోంది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని 9 నెలల క్రితం వైఎస్సార్‌సీపీ హయాంలో నాయకులు అధికారులతో మాట్లాడి సుమారు రూ.23 లక్షలతో గణపతినగర్ కొండ ప్రాంతంలో పిల్లర్లతో కూడిన రక్షణ గోడ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ పనులకు సంబంధించి భూమి పూజ చేశారు. దీనిలో భాగంగా కాంట్రాక్టర్ ఇక్కడ గోడ నిర్మాణం జరిపే స్థలంలో శుభ్రం చేయడం, కొలతలు వేయడం చేశారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు మొదలు పెడతారని ఆ ప్రాంతవాసులు ఆశగా ఎదురుచూశారు. కారణమేమో కానీ, కాంట్రాక్టర్ పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. అయితే వచ్చే వర్షాకాలంలోపు అయినా పనులు పూర్తి చేయాలని కొండప్రాంతవాసులు కోరుతున్నారు.



గణపతినగర్ కొండ ప్రాంతంలో జరగని రక్షణ గోడ పనులు

అదే కారణమా..!

కూటమికి చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులకు సంబంధిత కాంట్రాక్టర్ తన టెండర్ మొత్తంలో కొంత కమీషన్ రూపంలో ఇవ్వకపోవడం వల్లనే పనులు నిలిచాయని పలువురు అంటున్నారు. పనులు మొదలు పెడితే తమ వాటా సంగతి ఏమిటని అడుగుతున్నట్లు తెలిసింది. వాటి మాట తేల్చిన తర్వాతే పనులు మొదలుపెట్టాలని అంటున్నట్లు సమాచారం.

రక్షణ గోడ లేక భయంగా ఉంటోంది



మా గ్రామం కొండ ప్రాంతంలో ఉంటుంది. భారీ వర్షాలు వస్తే మట్టి చరియలు విరిగిపడి పడతాయని భయంగా ఉంటోంది. దీనిపై అధికారులకు, పాలకులకు ఎన్నోసార్లు చెప్పాం. వస్తున్నారు..చూస్తున్నారు..వెళ్తున్నారు తప్ప పనులు జరగట్లేదు.

– ఎం.అప్పలరాజు, గణపతినగర్ గ్రామ అధ్యక్షుడు

వర్షాలు వస్తే ఉండలేం



గతేడాది వర్షాకాలంలో కొండప్రాంతంలో ఉన్నవాళ్లం అందరం బిక్కుబిక్కుమంటూ ఉన్నాం. ఈ వేసవిలో అయినా పనులు పూర్తి చేయకపోతే రానున్న వర్షాల సీజన్‌లో చాలా ఇబ్బంది పడతాం. అధికారులు, పాలకులు స్పందించాలి. రక్షణగోడ నిర్మించాలి.

– తాతారావు, స్థానికుడు

కాంట్రాక్టర్లు రావట్లేదు

కొండ ప్రాంతంలో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. అందుకే పనులు వాయిదా పడుతూ వస్తున్నాయి.

– రమేష్, జీవీఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్

సింహాచలం రైల్వేస్టేషన్‌లో అందుబాటులోకి వీల్ చైర్లు



వీల్ చైర్‌లో వృద్ధురాలిని తీసుకువస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు వీల్‌చైర్‌లు అందుబాటులోకి తీసుకొచ్చారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా దూసి నుంచి సింహాచలం వచ్చిన వృద్ధురాలిని ఆర్పీఎఫ్ సిబ్బంది వీల్‌చైర్‌లో స్టేషన్ బయటికి తీసుకువచ్చారు. దివ్యాంగులు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులకు ఈ సేవలు అందిస్తామని ఆర్పీఎఫ్ సిబ్బంది తెలిపారు. ఈ సేవలు పొందాలంటే స్టేషన్‌లో ఉన్న ఆర్పీఎఫ్ పోలీసులను లేదా స్టేషన్ మాస్టర్ గదిలో ఉన్న ఉద్యోగులను సంప్రదించాలని సూచించారు.

ఎన్ఎస్‌టీఎల్‌లో భద్రతా వారోత్సవాలు



భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న ఉద్యోగులు, సిబ్బంది, యూనియన్ నాయకులు

గోపాలపట్నం: ఎన్ఎస్‌టీఎల్‌లో భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మానసి ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్ మాట్లాడుతూ పని ప్రదేశంలో ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ మాట్లాడుతూ సంస్థలో చేపడుతున్న భద్రతా చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్‌లోని పలు విభాగాల అధిపతులు, సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు, వర్క్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌పై మరమ్మతులతో నిలిచిన ట్రాఫిక్

అగనంపూడి: అగనంపూడి–లంకెలపాలెం మధ్య రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. అగనంపూడి వంతెనపై మరమ్మతుల కోసం సగ భాగం తవ్వకాలు చేపట్టడంతో ఒక వాహనం వెనుక మరో వాహనం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 వరకు వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. ట్రాఫిక్ ఎందుకు నిలిచిందో తెలియక వాహనదారులు చిరాకు పడ్డారు. రాత్రి 7 గంటలు దాటాక కూడా పనులు కొనసాగించడంతో మరింత ట్రాఫిక్ చిక్కులు వచ్చాయి.

ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ



58వ వార్డు పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ లావణ్య



59వ వార్డులో కేక్ కట్ చేస్తున్న పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ తదితరులు



60వ వార్డులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పి.వి.సురేష్



40వ వార్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు



88వ వార్డులో కేక్ కట్ చేస్తున్న దాడి నూకరాజు

మల్కాపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని పారిశ్రామిక ప్రాంత పరిధిలోని పలు వార్డుల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు.

➡ 58వ వార్డు ములగాడలో పార్టీ కార్యాలయం వద్ద కార్పొరేటర్ గులిగిందల లావణ్య పార్టీ జెండా ఎగరవేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటివరకు రాష్ట్రంలో పార్టీ సాధించిన ప్రగతి, పేదల సంక్షేమానికి చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో నాయకులు గులిగిందల కృష్ణ, గొండేశి సత్యనారాయణరెడ్డి, ధర్మాల వేణుగోపాలరెడ్డి, చుక్క వరలక్ష్మి, సాల్మన్‌రాజు, గంట్యాడ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

➡ 59వ వార్డు హనుమాన్‌నగర్ వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ పార్టీ జెండా ఎగరవేశారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో సంపత్‌కుమార్, పెద్దిరాజు, భూపతిరావు, ఎదుర సత్యనారాయణ, లోపింటి రమణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

➡ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ వద్ద జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనీల్‌కుమార్, పూండి మల్లేశ్వరరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో వైఎస్సార్‌సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ మళ్ల విజయప్రసాద్ ఆదేశాల మేరకు వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి, కార్యకర్తలకు తినిపించారు. దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

88వ వార్డులో..

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు కోటనరవలో పార్టీ కార్యాలయం వద్ద వార్డు అధ్యక్షుడు దాడి నూకరాజు వైఎస్సార్‌సీపీ జెండాను ఎగర వేశారు. కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రావడమే ఒక సంచలమని అన్నారు. నమ్మిన వారికి పార్టీ అండగా ఉంటుందని, ప్రజల కోసం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మళ్ల సత్యారావు, శరగడం సతీష్, ఎం.నూకప్పారావు, సాయి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

‘యువత పోరు’కు మేము సైతం..

భారీగా తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు



60వ వార్డు నుంచి వెళ్తున్న నాయకులు



పారిశ్రామిక ప్రాంత ఏడు వార్డుల నుంచి తరలివెళ్తున్న నాయకులు,కార్యకర్తలు

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు బుధవారం నగరంలో జరిగిన యువత పోరు కార్యక్రమానికి విశాఖ పశ్చిమ నియోజవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. శ్రీహరిపురం నుంచి ఏడు వార్డుల ప్రాంత నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు డాక్టర్ పి.వి.సురేష్, గులిగిందల లావణ్య, గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ఆయా విద్యార్థులను కళాశాల యాజమాన్యం ఇబ్బంది పెడుతోందన్నారు. మరోవైపు నిరుద్యోగులకు భృతి ఇస్తామన్న కూటమి నాయకులు ఆ ఊసే ప్రస్తావించడం లేదన్నారు. ఎన్నికల ముందు హామీలిచ్చి, నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం తప్పక ఫలితం అనుభవిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

89వ వార్డు నుంచి..

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు విశాఖ జిల్లా యూత్ అధ్యక్షుడు దొడ్డి కిరణ్ ఆధ్వర్యంలో యువ నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగులు బయల్దేరారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు పరిచే విధంగా ప్రభుత్వంపై పోరాటానికి ప్రజలు సిద్ధమయ్యారన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.



కొత్తపాలెం నుంచి దొడ్డి కిరణ్ ఆధ్వర్యంలో బయల్దేరుతున్న 89వ వార్డు నాయకులు

40వ వార్డు నుంచి..

సింధియా: యువత పోరు కార్యక్రమానికి 40వ వార్డు నుంచి కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు వంద మంది నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

దండి మార్చ్‌తో తెల్లదొరల గుండెల్లో దడ



అప్పికొండ తీరంలో జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెదగంట్యాడ: దండిమార్చ్‌తో తెల్లదొరల గుండెల్లో మహాత్మా గాంధీ దడ పుట్టించారని చేపలపాలెం మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు కూరపాటి వినోద్‌కుమార్ అన్నారు. దండిమార్చ్ డేను పురస్కరించుకుని విద్యార్థులతో కలసి అప్పికొండ తీరంలో జాతీయ జెండాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్వతంత్ర పోరాటంలో గాంధీ పాత్రను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో బుడగట్ల హేమంత్‌కుమార్, సోమునాయుడు, సోంబాబు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్–2025 పరీక్ష కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన వారు, ఈ ఏడాది చదువుతున్న వారు పాలిసెట్‌కు అర్హులన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 ఫీజు చెల్లించాలన్నారు. వచ్చే నెల 15 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని, పరీక్ష ఏప్రిల్ 30న నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ గ్రామంలోని ఆదర్శ రాయల్ విద్యాలయ స్కూల్లో ఆర్థికంగా వెనుకబడిన టెన్త్ క్లాస్ విద్యార్థులకు ది ఇండియన్ మహిళా ఫౌండేషన్ సహకారంతో పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ పర్యవేక్షణలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ అశోక్ వీటిని విద్యార్థులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి పదో తరగతి మొదటి మెట్టు అని పేర్కొన్నారు. విద్యార్థులంతా ఈ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి, అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. జి.వి.ఎల్. పద్మ మాట్లాడుతూ ఒత్తిడిని జయించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో నాగాల నాగమణి, ఎం.దుర్గాప్రసాద్, బలివాడ కన్నబాబు, నాగాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేపగుంట ముత్యమాంబ పండగ



కొబ్బరికాయలతో అలంకరించిన ఆలయం

పెందుర్తి: వేపగుంట ప్రజల ఆరాధ్య దేవత ముత్యమాంబ అమ్మవారి వార్షిక పండగ గురువారం భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వేలాది కొబ్బరి కాయలతో ఆలయాన్ని అలంకరించారు. నాలుగు రోడ్ల కూడలిలో విద్యుత్ దీపాలు కాంతులీనుతున్నాయి. వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి గురువారం వేకువజామునే తొలిపూజ చేసి దర్శనాలు కల్పిస్తారు. పండగ సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అమ్మవారి గర్భగుడి దర్శనం నిషేధించారు. ఉత్సవంలో భాగంగా సాయంత్రం అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం అనుపోత్సవం జరుపుతారు. మొత్తం నాలుగు వేదికల్లో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు టీవీ నటులతో స్కిట్‌లు, బుర్రకథలు, బళ్లవేషాల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం రాత్రి తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. పురవీధుల్లో అమ్మవారి ఘటాల ఊరేగింపు సంప్రదాయబద్ధంగా జరిగింది.

ఉత్సాహంగా ఎన్టీపీసీ గ్రామీణ క్రీడా పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ



హోరాహోరీగా బాలికల కబడ్డీ పోటీలు

అగనంపూడి: ఎన్టీపీసీ ఆధ్వర్యంలో లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన గ్రామీణ క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాజ్యోతి వెలిగించి క్రీడా ప్రతిజ్ఞ చేశారు. పావురాలు ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, త్రోబాల్‌తోపాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన జట్లకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏజీఎం ఆత్రో, మేనేజర్ ప్రకాశరావు, పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి కె.ఎం.నాయుడు, టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కనకారావు, మండల వ్యాయామ ఉపాధ్యాయులు, 14 హైస్కూళ్లకు చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గాజువాక పీహెచ్‌సీలో కేంద్ర బృందం

గాజువాక: మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగానికి చెందిన పాపులేషన్ రీసెర్చ్ కమిటీ (కేంద్ర బృందం) గాజువాక పీహెచ్‌సీను బుధవారం సందర్శించింది. డాక్టర్ యడ్ల రమణ, డాక్టర్ సీహెచ్ పాదాలు నేతృత్వంలో పీహెచ్‌సీకి వచ్చిన బృందం.. కిశోర బాలికలకు, బడి ఈడు పిల్లలకు ప్రతివారం ఐరన్ మాత్రలు, ఏడాదికి రెండు సార్లు నులిపురుగుల మాత్రల పంపిణీ, శుక్ర, శనివారాల్లో కిశోర బాలికలకు అవసరమైన వైద్య పరీక్షలు, మానసిక, లైంగిక విద్యపై అవగాహన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకరరావు కేంద్ర బృందానికి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నాగ అప్పారావు, సిబ్బంది శాంతిప్రియ, వాసు, లోవరాజు, రాణి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో పోలీసుల అదుపులో ఇద్దరు



లారీ పక్క భాగం అద్దాలు పగులగొట్టిన దొంగలు

అక్కిరెడ్డిపాలెం: రాత్రుళ్లు లారీలను రోడ్డు పక్కన నిలిపి, నిద్రిస్తున్న డ్రైవర్లను బెదిరించి వారి నుంచి నగదు, సెల్ ఫోన్లను దొంగిలిస్తున్న కేసుల్లో ఇద్దరు అనుమానితులను గాజువాక క్రైం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు. ఒడిశాకు చెందిన అభిషంత్(35) సర్దార్ నెస్ట్ రోడ్డులో, జార్ఖండ్‌కు చెందిన ఇలియాజ్(32) వై జంక్షన్ రోడ్డులో బుధవారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో రోడ్డు పక్కన తమ లారీలను పార్క్ చేసి పడుకున్నారు. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు వారి లారీ వద్దకు చేరుకుని డోర్ కొట్టి డ్రైవర్లను లేపే ప్రయత్నం చేశారు. డ్రైవర్లు డోర్ తియ్యకపోవడంతో లారీల అద్దాలు పగులగొట్టడంతో భయాందోళనతో డ్రైవర్లు డోర్లు తెరిచారు. దీంతో ఆ ఇద్దరు వ్యక్తులు అభిషంత్‌పై దాడి చేసి రూ.2 వేల నగదు, 2 సెల్ ఫోన్లు, ఇలియాజ్ నుంచి రూ.1500 నగదు, సెల్ ఫోన్ లాక్కున్నారు. ఇద్దరు డ్రైవర్ల ఫిర్యాదు మేరకు గాజువాక క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. మదీనాబాగ్‌కు చెందిన అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.